బాబోయ్.. చలి చంపేస్తోంది..!

- రాత్రి, పగలు తేడా లేకుండా వణికిస్తున్న చలి గాలులు
- తెల్లవారినా వీడని మంచు తెరలు
- అల్ప పీడనంతో మరింత తగ్గిన ఉష్ణోగ్రతలు
- చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు
- బయటకు రావడానికి భయపడుతున్న జనం


మురమళ్లలో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్న వ్యాపారులు

ముమ్మిడివరం: చలి పులి పంజా విసురుతోంది. గత 15 రోజుల నుంచి గాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. వరుస అల్ప పీడనాల నేపథ్యంలో పగటి పూట సైతం చలి గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది గాలుల తీవ్రత ఎక్కువగా ఉందని, ఇంతటి స్థాయిలో ఉష్ణోగ్రతలు తగ్గటం ఆశ్చర్యంగా ఉందని పలు చోట్ల చర్చించుకుంటున్నారు. గతంలో పోల్చుకుంటే 10 నుంచి 15 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగటి పూట సగటున 25 నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగత్రలు నమోదవుతున్నాయి. రాత్రి పూట సైతం ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడం.. గాలిలో తేమ శాతం అమాంతం తగ్గడంతో ప్రజలు వణికిపోతున్నారు. పగటి పూట గాలిలో తేమ 56 నుంచి 60 శాతం మధ్య నమోదవ్వగా.. రాత్రి పూట గరిష్టంగా 87 శాతం వరకు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రి పూట చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు, ఆస్మా, ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనవరి చివరి వరకూ చలి గాలుల ప్రభావం ఇదే స్థాయిలో ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

మరింత పెరిగే అవకాశం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనంతో గత రెండు రోజులుగా వాతావరణం మేఘావృతంగా మారడంతో పాటు ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. పగటి పూట సైతం చలి గాలులు వీయడంతో ప్రజలు వణికి పోతున్నారు. ఈశాన్య రుతు పవనాల ప్రభావం తీర ప్రాంతాలపై ఎక్కువగా ఉంది. రానున్న రోజుల్లో చలి గాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉన్ని దుస్తులతో రక్షణ

చలి తీవ్రతను తగ్గించేందుకు ఉపయోగపడే ఉన్ని దుస్తుల దుకాణాలు విరివిగా వెలుస్తున్నాయి. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారస్తులు రహదారుల వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. ఇక్కడ రూ.వంద నుంచి రూ.ఐదు వేల వరకు విలువ చేసే దుస్తుల విక్రయాలు జరుగుతున్నాయి. రంగురంగుల ఉన్ని దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, స్వెటర్లు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. చలి గాలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులను వాడడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు ఉపయుక్తంగా ఉంటాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



సీజన్ మారినప్పుడల్లా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం సహజమే. అయితే వాతావరణ మార్పుల కారణంగా కొంత మందిలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చంటి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఉదయం చలి గాలుల్లో వాకింగ్ చేయడం మానుకోవాలి. వేడిని పుట్టించే ఉన్ని వస్త్రాలు ధరించాలి.

సీహెచ్.ముకుంద,
పీహెచ్‌సీ వైద్యురాలు, కొత్తలంక.

గుమ్మడి పాదుల తొలగింపు


పాదులు తొలగించిన విద్యుత్ స్తంభం

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న గుమ్మడి పాదులను అధికారులు మంగళవారం తొలగించారు. విద్యుత్ తీగలపై గుమ్మడి పాదులు అల్లుకోవడమే కాక గుమ్మడి కాయలు సైతం విరగ కాస్తున్నా పట్టించుకోని వైనంపై ఈ నెల 16న 'నిర్లక్ష్యపు గుమ్మళ్లు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ తీగలకు అల్లుకున్న పాదులను తొలగించారు. ఎన్నో రోజుల నుంచి మొత్తుకుంటున్నా సమస్యను పట్టించుకోని అధికారులు సాక్షి వార్తకు స్పందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

దుర్గా భవానీ ఆలయ వార్షికోత్సవం

అమలాపురంరూరల్: మండలంలోని ఈదరపల్లి వంతెన వద్ద వేంచేసి యున్న దుర్గా భవానీ ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ చేపట్టారు. కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం

అమలాపురం రూరల్: అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవనంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరగనున్నట్లు కలెక్టరేట్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించనున్నారు.

నేటి నుంచి ఆయుష్మాన్ హెల్త్ కార్డుల పంపిణీ

యానాం: ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల జారీని నేటి నుంచి స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రారంభిస్తున్నట్లు మంగళవారం వైద్యాధికారి డాక్టర్ టి రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్‌ఏ)కార్డులను జారీ చేస్తామన్నారు. యానాం నియోజకవర్గ ప్రజలు ఈ కార్డులను పొందడానికి ఆధార్, ఆధార్ నెంబరుకు లింక్ అయిన మొబైల్ ఫోన్‌ను (ఓటీపీ కొరకు) తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

భవిత కేంద్రం సందర్శన


బండారులంక భవిత కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం రూరల్: బండారులంక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గల భవిత కేంద్రాన్ని మంగళవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సందర్శించారు. పిల్లలతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కల్పించారు. రికార్డులను పరిశీలించారు. ఫిజియోథెరపీ యథావిధిగా ప్రతివారం నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హైస్కూల్ ను సందర్శించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ముమ్మిడివరం: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసీటీసీ కౌన్సిలర్ టి.అంజలీదేవి సూచించారు. ముమ్మిడివరం శ్రీకృష్ణ దేవరాయ జూనియర్ కళాశాల, రావు బహదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన ఎయిడ్స్‌డే అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీబీఎల్‌టీ కౌన్సిలర్ ఆర్. రాజేశ్వరి, కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, అధ్యాపకులు గుర్రం మహేష్, వంగా విశాల, ఆకుల దుర్గ, బండారు వీరలక్ష్మి, మోరంపూడి గీతాంజలి పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ఇంధన పొదుపు' బుర్రకథ


అధికారుల పర్యవేక్షణలో ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఇంధన పొదుపుపై మంగళవారం సాయంత్రం ప్రదర్శితమైన బుర్రకథ వినియోగదారులను ఆలోచింపజేసింది. ఏటా డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకూ జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో బుర్రకథను ప్రదర్శించారు. ప్రజలు అనవసర విద్యుత్ వాడకాన్ని నిరోధించాలని కళాకారులు తమ కళా నైపుణ్యం ద్వారా చైతన్య పరిచారు. ప్రదర్శనను ట్రాన్స్‌కో జిల్లా సూపరింటెండెంట్ ఎస్. రాజబాబు, ఈఈ మోకా రవికుమార్, డీఈఈ అన్నవరం, ఏఈ ఆనందరాజు పర్యవేక్షించారు. బుర్రకథ ప్రదర్శనకు ముందు వారు ప్రసంగించి ఇంధన పొదుపు పట్ల ప్రతి వినియోగదారుడు అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఉచిత బియ్యం పంపిణీ పరిశీలన

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల్లోని రేషన్ షాపుల ద్వారా మంగళవారం నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేపట్టడటంతో ఈ ప్రక్రియను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా పరంపేట, అయ్యన్ననగర్, దరియాలతిప్ప, దొమ్మేటిపేట ప్రాంతాల్లో రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పంపిణీ చేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. బియ్యం పంపిణీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

నిత్యావసరాల ధరల అదుపులో ప్రభుత్వం విఫలం



వేదికపై మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

అమలాపురం టౌన్: నిత్యావసర వస్తువుల ధరల అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో మంగళ, బుధవారాల్లో జరుప తలపెట్టిన పార్టీ జిల్లా మహాసభల్లో తొలిరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని, రాష్ట్రాల హక్కులను హరిస్తోందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.మాల్యాద్రి ఆరోపించారు. రైతులు, కౌలు రైతుల సమస్యలు, పెరిగిన విద్యుత్ చార్జీలపై మహాసభలు చర్చించాయి. పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు టి.నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సత్కారం


అమలాపురంలో సత్కారం అందుకున్న పెన్షనర్లు


ముమ్మిడివరంలో సీనియర్ పెన్షనర్ త్రిమూర్తులుకు సత్కారం

అమలాపురం టౌన్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పెన్షనర్లకు సామూహిక సత్కారాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాక్షించారు. పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల పోరాట యోధుడు డీఎస్ నకారా వారసత్వం మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేపీ జగదీశ్వరరావు మాట్లాడుతూ పెన్షనర్లు తమ హక్కులను శాంతి యుత పద్ధతిలో సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ అధికారులు, ఉద్యోగులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురిని డీఐఈవో సోమశేఖరరావు సత్కరించి వారికి పెన్షనర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డీఐఈవో కార్యాలయంలో పదోన్నతి పొందిన ఉద్యోగి ఆర్.శ్రీనివాసమూర్తిని డీఐఈవో సత్కరించి అభినందించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో రెడ్డి వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. దేశంలో ఉన్న పెన్షనర్లందరికీ ఒకే రకమైన పెన్షన్ విధానం ఉండాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన రోజు డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్ పల్లకి త్రిమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనిపెల్ల సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామకృష్ణారావు, నేరేడిమిల్లి అబ్బులు, వాకా మధుసూదన రావు, బీర కృష్ణమూర్తి, కాకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న వీరన్న

అమలాపురం టౌన్: ఇళ్లల్లో గృహిణులు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని అమలాపురం మున్సిపాలిటీ వార్డు సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విర్వాన్మెంట్ సెక్రటరీ బండి వీరన్న సూచించారు. పట్టణంలోని ఆరో వార్డు రాజీవ్ వీధికి చెందిన మహిళలకు తడి, పొడి చెత్త వర్గీకరణపై బండి వీరన్న మంగళవారం అవగాహన కల్పించారు. ఇంట్లో వచ్చే తడి చెత్తను ఆకు పచ్చ డబ్బాలోనూ, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలోనూ, హానికరమైన చెత్తను ఎరుపు రంగు డబ్బాలోని వేయాలని సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నుంచి చెత్త వర్గీకరణ, ఇంట్లోనే ఎరువుల తయారీపై తాజాగా జారీ చేసిన ఆదేశాల సారాంశాన్ని వివరించి అవగాహన కల్పించారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

జిల్లా పౌర సరఫరాల మేనేజర్ బాల సరస్వతి

అమలాపురం రూరల్: రాబోయే మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ బాల సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, గ్రామాలలో ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించే రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తుపాను ప్రభావిత జిల్లాలలో కోనసీమ జిల్లా ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. ఎక్కడైతే కోతలు పూర్తి కాలేదో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు సమన్వయంతో రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు.

తాళ్లరేవు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా భాస్కర్రాజు

తాళ్లరేవు: మండల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా వేగేశ్న భాస్కరరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కాకినాడ ఇంద్రపాలెం ఇరిగేషన్ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికల్లో మండలానికి చెందిన ఆరు సంఘాల అధ్యక్షులు భాస్కర్రాజును చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్‌గా మొగలితుర్తి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన ఇరువురికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. కాజులూరు మండల పరిధిలో అంతర్భాగంగా ఉన్న పటవల నీటి సంఘం అధ్యక్షుడు కొత్తూరు కాశీ ఈశ్వరుడు జగన్నాథగిరి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

ఆరోగ్యకర గ్రామాల ఏర్పాటే లక్ష్యం


అల్లవరం శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అమలాపురం రూరల్: ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యంగా అంతా కృషి చేయాలని డీఎల్‌డీవో త్రినాథ రావు సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరమైన గ్రామాభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. డీఎల్‌డీవో త్రినాథరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి శిక్షణ తరగతులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళికపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంపై అవగాహన పెంచుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈఓపీఆర్డీ మంగా దేవి, టీఓటీలు రాము, అనంతలక్ష్మిలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

అల్లవరం: సుస్థిర లక్ష్యాలు సాధించడానికి గ్రామాల్లో సర్పంచ్‌లు ముఖ్య భూమిక పోషించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించి తొమ్మిది రకాల అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, కడలి గంగాచలం, సుందరనీడి సాయి, దాకారపు చిరంజీవిరావు, మల్లాడి మంగాయమ్మ, రాకాపు విజయలక్ష్మి, సీతారత్నం, సీహెచ్ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: సుస్థిర, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల ప్రణాళికపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత మంగళవారం ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ హాలులో ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి శిక్షణతో ఒరిగేదేమిటో..!

ఉప్పలగుప్తం: ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని మొదటి రోజు అధికారులు మొక్కుబడిగా ముగించి మమ అనిపించుకున్నారు. ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న 17 పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, విద్యాశాఖ, ఆరోగ్య, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పూర్తి స్థాయిలో పాల్గొనాల్సి ఉంది. కానీ సమావేశంలో కొద్ది మంది అధికారులు మాత్రమే కనిపించారు. మరికొంత మంది సర్పంచులు, అధికారులు కొంత సమయం వెచ్చించి వెళ్లి పోవడంతో సమావేశం ఎవరి కోసం పెట్టినట్లో అని మిగతా ఉద్యోగులు గుసగుసలాడుకున్నారు.

తాచుపాము కలకలం


పామును బంధిస్తున్న గణేష్ వర్మ

ముమ్మిడివరం: మండలంలోని అనాతవరం శివారు మునుకోటివారిపాలెంలో ఓ ఇంట్లో తాచుపాము ప్రవేశించి కలకలం రేపింది. స్థానికుడు మాగాపు వెంకటేశ్వరరావు ఇంట్లోకి పాము చొరబడడంతో కుటుంబ సభ్యులు భయ భ్రాంతులకు గురయ్యారు. భీమవరానికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పామును ప్లాస్టిక్ డబ్బాలో బంధించి తీసుకువెళ్లాడు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయండి

డీఈఓ పి.రమేష్


సీబీవీపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డీఈఓ రమేష్

తాళ్లరేవు: కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మంగళవారం మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నదీ లేనిదీ సీబీవీ పాలెం హెచ్ఎం సాయిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోరంగి పంచాయతీ సీతారామపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. విద్యార్థులు వెనుకబాటులో ఉండటంతో డీఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ఎమ్మెల్సీ అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ అంతర జిల్లాలో పోటీల్లో సత్తా చాటి పతకాలు ఒడిసి పట్టుకున్న అమలాపురానికి చెందిన ముగ్గురు మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులను మాజీ జాతీయ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మంగళవారం అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా స్థలంలో వారిని అభినందించి సత్కరించారు.

వంటా వార్పుతో నిరసన

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సిబ్బంది తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో వారు వంటా వార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరం వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది యెరుబండి వెంకట సత్యనారాయణ, సీహెచ్.కుమార్, మేడిద దుర్గ, నాగారపు శ్రీను, దంగేటి కృష్ణ, సంసాని శేఖర్ తదితరులు నిరసనకు నాయకత్వం వహించారు.

సత్యభాస్కర్‌కు ఉత్తమ రైతు పురస్కారం

యానాం: వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు, స్థానిక రైతు మాజేటి సత్యభాస్కర్ ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపికయ్యారు. వ్యవసాయ అనుబంధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే రైతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఏరువాక ఫౌండేషన్ ప్రతి ఏడాది వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రకటిస్తుంది. ఏపీలో ప్రతిభావంతులైన సుమారు 34 మందిని ఎంపిక చేయగా వరిసాగుకు సంబంధించి ఏపీ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. ఇందులో భాస్కర్‌కు పురస్కారం వరించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనను అభినందించారు. ఈ పురస్కారాన్ని త్వరలో విజయవాడలో జరగబోయే కార్యక్రమంలో ఆయన అందుకోనున్నారు.

డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడిగా చిట్టిబాబు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎనిమిది నీటి సంఘాలకు గాను డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడిగా చల్లపల్లి గ్రామానికి చెందిన దంగేటి వెంకట రెడ్డినాయుడు (చిట్టిబాబు) మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు నాయకులు, రైతులు ఆయనను అభినందించారు.

నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా గోపిరాజు

అల్లవరం: అల్లవరం నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన దాట్ల వెంకటరాజ గోపాలరాజు ఎన్నికైనట్లు తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా కిత్తనచెరువు గ్రామానికి చెందిన బండారు వెంకటేశ్వరరావు నియమితులైనట్లు చెప్పారు.

ఆక్రమణ భూములను పేదలకు పంచాలి

అల్లవరం: గోడిలంక పంచాయతీ వద్ద డీటీ అడపా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి హాజరైయ్యారు. తులసీరావు గోడిలంకలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణదారుల చెర నుంచి విడిపించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు డిమాండ్ చేశారు. ఆ భూములను పేదలకు పంచాలని రెవెన్యూ సదస్సు వేదికగా అధికారులను డిమాండ్ చేశారు.

బైబిల్ సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

అమలాపురం టౌన్: స్థానిక బైబిల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బ్రదర్ పి.పాల్ ప్రసాద్ మృతి పట్ల అమలాపురం టౌన్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. బ్రదర్ పాల్ ప్రసాద్ పేద వర్గాలు, క్రైస్తవ సమాజానికి ఎన్నో సేవలు అందించారని అసోసియేషన్ అధ్యక్షుడు సక్కా రాజ కిషోర్ పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన స్థానిక అరిగెలపాలెంలో మంగళవారం పాల్ ప్రసాద్ సంతాప సభ నిర్వహించారు.

తాటాకు ఇళ్లు దగ్ధం

ముమ్మిడివరం: అన్నంపల్లి శివారు చింతపల్లిలంకలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించిన ఘటనలో రెండు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. మల్లాడి సత్తిబాబు, మల్లాడి సత్యనారాయణలకు చెందిన తాటాకు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా.